# తస్మాత్ జాగ్రత్త



— కె.వి. రామదాస్

"ఊరె... నువ్వేనన్నమాట ఫోను చేసింది" ఎదుట నిలబడ్డ వ్యక్తిని నఖశిఖపర్యంతం చూస్తూ అన్నారు శ్రీనివాసంగారు.

"అవును సార్, నేనే!"

"ఆ ! నీ పేరేదో అన్నావు..." గుర్తు తెచ్చుకుందికి ప్రయత్నిస్తూ అన్నారు శ్రీనివాసంగారు.

"మోహన్" వెంటనే సమాధానం చెప్పాడా వ్యక్తి.

"చూడు మోహన్! ఇంతకీ బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?"

శ్రీనివాసంగారి సంశయం మోహన్‌కి అర్థమైంది.

"నేనున్న పరిస్థితిలో ఆలోచించే అవకాశం ఎక్కడిది సార్! నా అవసరం నాకా అవకాశాన్ని యివ్వలేదు!" నిస్పృహ ధ్వనించే గొంతుతో జవాబిచ్చాడు మోహన్.

"సరే! రేపు ఉదయం వస్తే, డాక్టర్‌ని కలవడానికి వెళ్దాం. ఆ తరువాత మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు" మోహన్‌తో అన్నారు శ్రీనివాసంగారు.

శ్రీనివాసంగారి సమాధానంతో మోహన్‌కి పది ఏనుగుల బలం వచ్చినట్టయింది. చివరి ఆశగా ఇక్కడికొచ్చాడు. అది కాస్తా కలిసివచ్చేసరికి అతడిలో జీవకళ తళుక్కుమంది.

***

శ్రీనివాసంగారు కారుని స్పీడుగా పోనిస్తున్నారు. అతడి షార్ప్ కటింగ్స్‌కి వెనక సీట్లో కూర్చున్న మోహన్ కలవరపడుతున్నాడు. కిటికీలోంచి బయట దృశ్యాలని చూస్తూనే, మదిలో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఉదయం తన భార్యతో జరిపిన సంభాషణ అతడికి అప్రయత్నంగా గుర్తుకొచ్చింది.

"ఏమిటండీ... యిదంతా! ఏదో పేపర్లో కిడ్నీ కావాలనే ప్రకటన మీరు చూడటమేమిటి? ఎంత కావలిస్తే అంత డబ్బు ఇస్తామన్నారని ముందు వెనుకాలోచించకుండా మీరు కిడ్నీ అమ్మడానికి సిద్ధపడటమేమిటి? నా ఆరోగ్యం బాగుపడడం కోసం మీ ఆరోగ్యం పాడుచేసుకోవడం... వద్దండీ" ఏడుస్తూ అంది మోహన్ భార్య.

"నిన్ను బ్రతికించుకోవడం ఇప్పుడు నాకు ముఖ్యం. నువ్వు లేకపోతే మన పిల్లల ఆలనాపాలనా ఎవరు చూస్తారు? అయినా పెద్దల్నెదిరించి నిన్ను పెళ్ళిచేసుకుంది యిలా చూస్తూ చూస్తూ నిన్ను మృత్యుముఖాన పడవేయడానికా? నిన్ను దక్కించుకునేందుకు ఈ పేద భర్తకి లభించిన చక్కని అవకాశమిది. ప్లీజ్! నా నిర్ణయానికి అడ్డు చెప్పకు!" భార్యని ఓదారుస్తూ అన్నాడు మోహన్.

ఈ మాటలు ఆమెని తృప్తిపరచలేకపోయాయి. ఆమె కళ్ళలో ఏదో భయం, గుండెల్లో గుబులు మోహన్‌కి స్పష్టంగా తెలుస్తూనే వుంది.

సడన్‌బ్రేక్‌తో కారు ఒక్కసారిగా ఆగేసరికి మోహన్ ఆలోచనలు చెదిరిపోయాయి.

కారు పెద్ద హాస్పటల్ ముందు ఆగింది. సిటీలో బహుశా అదే ఖరీదైన హాస్పటలేమో! మోహన్ ఆ హాస్పటల్ రూపురేఖలు చూస్తూనే, హైక్లాస్ పీపుల్ మాత్రమే ట్రీట్‌మెంట్ తీసుకొనగలిగేదని గ్రహించాడు.

ముందు శ్రీనివాసంగారూ, ఆ వెనుకే మోహన్ దిగారు. ఇద్దరూ తిన్నగా డాక్టర్ చాంబర్ వైపు కదిలారు. చాంబర్ ఎంట్రన్స్ డోర్‌కున్న నేమ్ ప్లేటు మీద 'డాక్టర్ మనోహర్ చౌదరి, ఎం.డి., నెఫ్రాలజిస్ట్' అని వ్రాసి వుంది.

"మే ఐ కమిన్ సార్?" డోర్ నాక్ చేస్తూ అన్నారు శ్రీనివాసంగారు.

"యస్, కమిన్" లోపలి నుండి సమాధానం వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ డాక్టర్!" విష్ చేస్తూ అన్నారు శ్రీనివాసంగారు.

డాక్టర్ చిరునవ్వుతో తిరిగి విష్ చేశారు.

"హీ యీజ్ మిస్టర్ మోహన్" మోహన్ని డాక్టర్‌కి పరిచయం చేస్తూ అన్నారు శ్రీనివాసంగారు. ఆ తరువాత వారిద్దరి మధ్యా చాలా మాటలు దొర్లాయి.

మోహన్ని కొన్ని టెస్టులు చెయ్యాలన్నారు డాక్టర్. ఆ టెస్టుల వలన మోహన్ కిడ్నీ శ్రీనివాసంగారికి మార్పిడి చెయ్యొచ్చో లేదో నిర్ధారించబడుతుందని చెప్పారు.

మోహన్ ఇంటర్వ్యూలో తలరాతని పరీక్షించుకునే నిరుద్యోగిలా డాక్టర్ వెంట కదిలాడు. శ్రీనివాసంగారు ఫలితం కోసం ఎదురుచూసే విద్యార్థిలా ఆత్రుత నిండిన హృదయంతో అసహనంగా అక్కడే కూర్చున్నారు.

గంట తరువాత ఇద్దరూ తిరిగి వచ్చారు. శ్రీనివాసంగారు ఆత్రుతగా వారి వైపు చూశారు. అది గమనించి, రిపోర్టు రావడానికి ఇంకా కనీసం రెండు గంటలు పడుతుందని డాక్టర్ చెప్పారు.

ఈ రెండు గంటలూ టెన్షన్‌తో గడపక తప్పదని శ్రీనివాసంగారితో పాటూ మోహన్ కూడా అనుకున్నాడు. ఈ ఫార్మాలటీస్ ఎంత వేగిరం పూర్తయితే అంత వేగిరం భార్యకి శుభవార్త చెప్పాలని ఆలోచిస్తున్నాడు మోహన్. అయితే శ్రీనివాసంగారి పరిస్థితి వేరేగా వుంది. తన పేపరు ప్రకటనకి స్పందించి వచ్చిన ఒకే ఒక వ్యక్తి మోహన్! అందుచేత రిపోర్టు పాజిటివ్‌గా వస్తే తనకు పునర్జన్మ లభించినట్టేనని ఆలోచిస్తున్నారు. ఇద్దరూ ఒకరినొకరు మూగగా ధైర్యం చెప్పుకొనే చూపులతో చూస్తూ కూర్చున్నారు.

కొంతసేపటికి అసిస్టెంట్ వచ్చి డాక్టర్‌గారి టేబుల్ మీద రిపోర్టు ఫైలు వుంచి వెళ్ళిపోయాడు. ఆ ఫైల్లో ఎక్సరే, మరికొన్ని రిపోర్టులున్నాయి. వెంటనే డాక్టర్ ఆ రిపోర్టు పరిశీలనలో మునిగిపోయారు.

"మిస్టర్ మోహన్! మీరు ఈ మధ్య ఏదైనా ఆపరేషన్ చేయించుకున్నారా?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగారు డాక్టర్.

ఊహించని ఈ ప్రశ్నకి మోహన్ ఆయోమయంలో పడ్డాడు.

"యస్ సార్! ఆర్నెల్ల క్రితం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించుకున్నాను" గుర్తుకుతెచ్చుకుంటూ అన్నాడు మోహన్.

ఈ సమాధానం విని డాక్టర్ ఏదో అర్థమైనట్టు తలాడించారు.

"ఆయామ్ సారీ టూ ఇన్‌ఫార్మ్ యూ! యు ఆర్ హేవింగ్ ఓన్లీ వన్ కిడ్నీ. మీ రెండవ కిడ్నీ దొంగిలింపబడింది" జాలిగా చూస్తూ అన్నారు డాక్టర్.

"వా...ట్...!" అనే కేక మోహన్ హృదయాంతరాలని ఛేదించుకుని వచ్చింది.

ఈ దేశంలో చాలా కాలంగా అనేక రకాల దొంగల్ని మనం చూస్తున్నాం. ఓట్లు దోచుకునే రాజకీయ నాయకులు.. . పేదవారి శ్రమని దోచుకునే ధనికులు... స్త్రీల మానాన్ని దోచుకునే కామాంధులు... ఇలా చాలా మంది. ఈ మధ్య కొత్తగా దొంగల్లో మరొక వర్గం చేరారు. వారే పేదప్రజల అవయవాలని దొంగిలించే మేధావి వర్గానికి చెందిన డాక్టర్లు! ప్రజలారా! తస్మాత్! జాగ్రత్త!!

